విలేజ్ క్లినిక్‌లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

నిడదవోలు రూరల్: ఆరోగ్య సిబ్బంది గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే గాకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని డీపీఎంఓ డాక్టర్ అభిషేక్‌రెడ్డి సూచించారు. మండలంలోని సింగవరం, సమిశ్రగూడెం గ్రామాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారుల టీకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డీపీఎంఓ డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జిల్లా గణాంకాధికారి కుమార్‌స్వామి, డీపీహెచ్‌ఎన్‌ఓ వసంతలక్ష్మి, డీపీఓ సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ రామకృష్ణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్యులు శివాజీ, శ్రీనిధి పాల్గొన్నారు.

400 మందికి 'సురక్ష' వైద్యం

తాళ్లపూడి: వేగేశ్వరపురం సచివాలయం-2 పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు నిశాంత్, హారిక గుప్తాలు సుమారు 400 మంది గ్రామస్తులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.

అభివృద్ధిలో దేవరపల్లి మండలం ముందంజ

- ఎంపీపీ కేవీకే దుర్గారావు
- మండల పరిషత్ సమావేశంలో పలు అంశాలపై చర్చ

దేవరపల్లి: అభివృద్ధిలో జిల్లాలోనే దేవరపల్లి మండలం ముందంజలో ఉందని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాబోయే మూడేళ్లలో మండలాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి సమర్థవంతంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని 34 జగనన్న లే అవుట్లలో బోర్లు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.7.15 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం 12 లే అవుట్లలో ఈ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఏవో కె.విజయ్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రూ.21 కోట్ల విలువైన 10,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేశామన్నారు. మొత్తం 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తికాగా, 9,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసినట్టు చెప్పారు. మిచాంగ్ తుపాను పంటల నష్టంపై వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు ఏవో తెలిపారు. హెక్టారుకు వరికి రూ.17 వేలు, పొగాకుకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం పరిహారంగా అందజేస్తుందన్నారు.

171 పనులకు రూ.8.55 కోట్ల జెడ్పీ నిధులు

సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ షాజహాన్ మాట్లాడుతూ 171 అభివృద్ధి పనుల కోసం జిల్లా పరిషత్ రూ.8.55 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటికే రూ.5 కోట్లతో 94 పనులను పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం 34 పనులు జరుగుతుండగా, మరో 43 పనులను ప్రారంభించవలసి ఉందన్నారు. గడపగడపకూ నిధులు గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రెండో విడత మంజూరైనట్టు చెప్పారు. ఎంఈఓ కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు మాట్లాడుతూ మండలంలోని 5,888 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను అందజేసినట్టు చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలపై సభ్యులు సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

నేటి నుంచి భావనారుషి మహోత్సవాలు

తాళ్లపూడి: స్థానిక శ్రీ భద్రావతి సమేత భావనా మహారుషి ఆలయం వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పద్మశాలీ సంఘం, ఉత్సవ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. రెండేళ్లకు ఒకసారి తాళ్లపూడిలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 13 నుంచి 20 వరకూ ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలకరించారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా 13న భజన, 14న కోలాటం, 15న రాజమహేంద్రవరం వారి మెలోడీ ఆర్కెస్ట్రా మ్యూజికల్ నైట్, 16న డ్యాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేశారు. 17న శూలాలు, భజంత్రీల కార్యక్రమం, కోబ్రా డ్యాన్స్, కోయ డ్యాన్స్, బుట్ట బొమ్మలు, కేరళ తీన్‌మార్, బాణసంచాలతో ప్రభల సంబరం నిర్వహిస్తారు. 20న దాతల సహకారంతో భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ, పద్మశాలీ సంఘం వారు తెలిపారు.



తాళ్లపూడిలోని పద్మావతీ సమేత భావనా మహారుషి

సందడిగా రంగవల్లుల పోటీలు

నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలాజీ నగర్ సచివాలయం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీలలో విజేతలకు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్, గౌన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం, తుట్ట గుంట దీపక్, ఎండీ ఫయజ్, చిలకల మల్లికార్జునరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఖండవల్లిలో భారీగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఖండవల్లి ఎస్సీ, బీసీ ఏరియాల్లో గడప గడపకూ..

పెరవలి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గత నాలుగున్నరేళ్లలో ఖండవల్లి పంచాయతీ పరిధిలోని 540 మంది అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నా రు. అంతకుముందు ఐదేళ్ల తెలుగుదేశం పాలనలో గ్రామంలోని ఎంతమంది పేదలకు ఇళ్ల స్థలాలు లభించాయని ఆయన ఆ గ్రామస్తులను ప్రశ్నించారు. ఒక్కరికి కూడా ఇంటి స్థలం రాలేదని ఆ గ్రామస్తులు ముక్తకంఠంతో బదులిచ్చారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం ఖండవల్లి గ్రామంలోని ఎస్సీ, బీసీ ఏరియాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిదులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఈ గ్రామంలోని 460 గృహాలను ఆయన సందర్శించారు. కాగా తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి ఈ రెండు ప్రాంతాల ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నాయకులొచ్చి కల్లబొల్లి హామీలు ఇస్తారని, నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, కందా వెంకన్న, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాట్టి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు మెరిపే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు పల్లేటి రవి, టొకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలు వివరించే బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నా భర్తను గంజాయి కేసులో ఇరికించారు

- జనసేన నాయకుడి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తాడు
- జైలు నుంచి విడిపించాలి
- బాధితుడి భార్య సంధ్య ఆవేదన

తాళ్లపూడి: తన భర్త లక్ష్మణ్‌ను అన్యాయంగా గంజాయి కేసులో ఇరికించారని, తన కుటుంబానికి న్యాయం చేయాలని మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన దళిత మహిళ అక్కాబత్తుల సంధ్య ఆరోపించింది. ఆ గ్రామంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడింది. తాడిపూడికే చెందిన జనసేన మండల నాయకుడైన గంటా కృష్ణ వద్ద తన భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపింది. గంటా కృష్ణ సూచనల మేరకే రెండు నెలల క్రితం తన భర్త లక్ష్మణ్ ట్యాంకర్ లారీపై డ్రైవర్‌గా వెళ్లాడని తెలిపింది. నాటి నుంచి ఇప్పటి వరకూ తన భర్త ఇంటికి రాలేదని సంధ్య చెప్పింది. కాగా తన భర్త గంజాయి కేసులో చిక్కుకుని, హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో ఉన్నట్టుగా కొద్ది రోజుల క్రితం పోలీసుల నుంచి తనకు ఫోన్ వచ్చిందని చెప్పింది. తన భర్తను విడిపించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పిన గంటా కృష్ణ రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆమె వాపోయింది. గంటా కృష్ణ వల్లే తన భర్త లక్ష్మణ్ జైలు పాలయ్యాడని ఆరోపించింది. ఇదిలా ఉండగా టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం తాడిపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చారు. లక్ష్మణ్ జైల్ విషయమై అతడి సోదరుడైన కరుణాకర్, ఇతర దళిత యువకులు గంటా కృష్ణను, జనసేన, టీడీపీ నాయకులను నిలదీశారు. దాంతో వారి మధ్య వాగ్వాదం కూడా జరిగింది.

విద్యావాణిజ్య కేంద్రంగా తాళ్లపూడి


- అందుబాటులో మెరుగైన వైద్యం
- జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం



నిత్యం రద్దీగా ఉండే తాళ్లపూడి బజార్ సెంటర్

తాళ్లపూడి: నిత్యం పాడి పంటలతో తులతూగే తాళ్లపూడి మండలం ఇప్పుడు విద్య, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక కేంద్రంగా కూడా పురోగతి సాధిస్తోంది. విద్యా కేంద్రంగా మండలం దినాదినాభివృద్ధి సాధిస్తోంది. పోలవరం, గోపాలపురం వంటి పొరుగు మండలాల ప్రజల అవసరాలు తీర్చే ప్రధాన కేంద్రంగా తాళ్లపూడి మండలం ఎదిగింది. స్థానిక కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యా సంస్థల్లో బీఈడీ, డీఈడీ వంటి టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో విద్య అభ్యసించేందుకు ఇతర జిల్లాల నుంచి కూడా పలువురు విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ కళాశాలలు సైతం ఉన్నాయి. తాళ్లపూడిలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో నర్సింగ్, పలు ఒకేషనల్ కోర్సులు, వృత్తి విద్యా కోర్సుల్లో అనేక మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వేగేశ్వరపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 30 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 వరకూ ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. మండలంలో మాంటిస్సోరి హైస్కూల్, రవీంద్రభారతి విద్యాలయ, శ్రీవిజేత, రేడియంట్, శ్రీ సాయితేజ విద్యాలయ, సన్ లైట్ స్కూల్, సెయింట్ లుక్స్, శ్రీ వాగ్దేవీ విజ్ఞాన్ స్కూల్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్, శ్రీ సూర్య స్కూళ్లు కార్పొరేట్ స్థాయి విద్యను గ్రామాల్లో అందిస్తున్నారు. గతంతో పోలిస్తే విద్యాపరంగా సదుపాయాలు మెరుగ్గా ఉండడంతో సాధారణ, మధ్య తరగతి వర్గాల వారు సైతం తమ పిల్లలను కాన్వెంట్లలోను, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇక ఆర్ ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మంగన్న మెటర్నిటీ నర్సింగ్ హోం, సాయిస్ఫూర్తి హాస్పిటల్, పిల్లలు, డెంటల్ హాస్పిటల్ వంటి వైద్యాలయాలు రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్నాయి. వస్త్ర దుకాణాలకు తాళ్లపూడి పెట్టింది పేరు. అలాగే కిరణా, జ్యూయలరీ, ఆటోమొబైల్స్ దుకాణాలూ ఎక్కువే. ఇలా వివిధ రకాల వస్తువుల విక్రయాలతో తాళ్లపూడి మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. పదుల సంఖ్యలో రైస్ మిల్లులు ఉండడంతో జట్టు కార్మికులకు ఉపాధి దొరుకుతోంది. ఇటీవల అన్నదేవరపేట, మండల పరిసర ప్రాంతాల్లో పలు భారీ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. ఫలితంగా వందలాది మంది వాటిలో ఉపాధి పొందుతున్నారు. తాళ్లపూడిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా బాగా పెరిగింది.


గోపాలపురం సీహెచ్‌సీలో మార్చురీ సేవలు



గోపాలపురం సీహెచ్‌సీలో మార్చురీ గదిని ప్రారంభించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పోర్టుమార్టం సేవలు అందుబాటులోకి వచ్చినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలోని మార్చురీ గదిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల పరిధిలోని మృతదేహాలకు ఇక్కడ పోస్టుమార్టం నిర్వహిస్తారన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు గోపాలపురం సీహెచ్‌సీలో అన్ని వసతులూ కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ కె.సనత్‌కుమారి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, తోట నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎస్సైగా అప్పలరాజు



ఉండ్రాజవరం: స్థానిక ఎస్సైగా వి.అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాయన ఇంతకు ముందు రాజమహేంద్రవరం త్రీ టౌన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఉండ్రాజవరం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై కె.రామారావు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అప్పలరాజును సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.